

ఇన్‌ఛార్జి జెడ్‌పి సిఇఓగా డిఆర్‌డిఎ పీడీ



విజయరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఓగా డిఆర్‌డిఎ పీడీ విజయరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత జెడ్‌పి సిఇఓ సుబ్బారావు వ్యక్తిగత కారణాల రీత్యా నెల రోజుల వరకు సెలవు పెట్టారు. దీంతో జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఓగా డిఆర్‌డిఎ పీడీ విజయరాజుకు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విజయరాజు బుధవారం జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఓగా బాధ్యతలు చేపట్టారు.

సాగునీటి పోరు వాయిదా



వాయిదా పడిన ఎన్నికల నోటిఫికేషన్
ప్రభుత్వం తీరుపై విమర్శలు వెల్లువ
అసహనం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతాంగం
అయోమయంలో సాగునీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి - భీమవరం

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఆటంకం ఏర్పడింది. బుధవారం విడుదల చేయాల్సిన ఎన్నికల నోటిఫికేషన్ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జిల్లా రైతాంగం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే కూటమి సాగునీటి ఎన్నికల పట్ల వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో సాగునీటి సంఘాల ఎన్నికలు అయోమయంలో పడ్డాయి. ఎప్పుడు నిర్వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారడంతో జిల్లాలో సర్వత్రా చర్చ జరుగుతుంది.

సాగునీటి సంఘాల ఎన్నికలపై అయోమయం కొనసాగుతోంది. ఈ నెల 21న జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. 2016లో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం గడువు పూర్తయినా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా అడ్డగోలుగా ముందుకు సాగింది. దీంతో కాలువల ఆధునికీకరణ వంటి పనులు పూర్తిగా పడకేసిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దీంతో రైతులు ఎంతగానో హర్షించారు. ఎన్నికలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను పార్టీ కార్యక్రమంగా చూస్తున్న పరిస్థితి ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్టోబర్ 16న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించి 40 రోజుల్లో పూర్తి చేస్తామని స్వయంగా జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇటీవల ప్రకటించారు. కానీ జరగలేదు. ఆ తేదీన ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయలేదు. దీంతో రైతుల్లో తీవ్ర చర్చ కొనసాగింది. ఈనేపథ్యంలో అక్టోబర్ 21న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన తొలి నోటిఫికేషన్ విడుదల చేశారు. అక్టోబర్ 22 నుంచి 31వ తేదీ మధ్య ప్రాదేశిక నియోజకవర్గాలు ఖరారు చేస్తారని తెలిపారు. నవంబర్ ఒకటి నుంచి రెండో తేదీ మధ్య ఈ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలను పరిష్కరించి ప్రాదేశిక నియోజకవర్గాల జాబితా ప్రకటిస్తారన్నారు. నవంబర్ ఆరు నుంచి 11వ తేదీ మధ్య ఓటర్ల జాబితా సిద్ధం చేసి అభ్యంతరాల స్వీకరణ అనంతరం 13న తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. నవంబర్ 20వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్, 21వ తేదీన సాగునీటి సంఘాల ప్రతినిధులను ఎన్నుకునేందుకు సాధారణ సర్వసభ్య సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో మేజర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్స్ ప్రాదేశిక నియోజకవర్గాలు 92, మైనర్ 253, మీడియం 11, రెండు ప్రాజెక్టు కమిటీలు తేల్చారు. పశ్చిమగోదావరి జిల్లాలో మేజర్ యూజర్స్ అసోసియేషన్స్ 98, మైనర్ 14, ప్రాజెక్టు కమిటీ ఒకటిగా తేల్చారు. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న తరుణంలో ఎన్నికలు వాయిదా వేయాలనుకోవడం ఏంటో ఏ ఒక్కరికీ అర్థంకావడం లేదు. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ అంతా చట్టం పరిధిలోనే జరుగుతోంది. అటువంటప్పుడు ఒకసారి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక ఇష్టానుసారంగా వాయిదా వేయడం రెవెన్యూ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వాయిదా పడిన నోటిఫికేషన్


ఈ నెల 20వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. అయితే దీన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమది రైతు ప్రభుత్వమని వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల ఉన్నతికి నిరంతరం కృషి చేస్తున్నామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం సాగునీటి ఎన్నికల నిర్వహణ పట్ల వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. అసలు సాగునీటి ఎన్నికలు జరుగుతాయా లేదా అని సర్వత్రా చర్చ సాగుతోంది.

ఆది నుంచి విమర్శలే..

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతోంది. ఓటర్ల జాబితాలో అవకతవకలు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నెల ఆరో తేదీ నుంచి 11వ తేదీ వరకూ ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని తొలి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. 13వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటించాల్సి ఉంది. అసలు ఆ ప్రక్రియ జరిగిందో లేదో కూడా తెలియని పరిస్థితి. ఓటర్ల జాబితా సిద్ధం చేసిన తర్వాత పంచాయతీల వద్ద జాబితా డిస్ప్లే చేసి అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ జరిగిందో లేదో కూడా తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తాం

ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి



సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 20వ తేదీన విడుదల కావాల్సిన నోటిఫికేషన్ వాయిదా పడింది. ప్రభుత్వం ఆదేశానుసారం త్వరలో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తాం. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తాం.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఒఎలు

తొలగించిన విఒఎలను విధుల్లోకి తీసుకోవాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో అక్రమంగా తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అన్యాయంగా తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 8 నెలల వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని, విఒఎలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని పెద్ద ఎత్తున నినదించారు. ధర్నాలో యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎప్పటి నుంచో విధులు నిర్వర్తిస్తున్న విఒఎలను రాజకీయ వేధింపులకు గురిచేస్తూ అక్రమంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా ప్రభుత్వంలో మా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తామంటూ స్వయంగా అధికార పార్టీ నాయకులే అక్రమంగా విఒఎలను తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులే నేరుగా వెళ్లి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించి, గ్రూపుల ఆమోదం తీసుకోకుండా, గ్రామ సంఘం సమావేశాలు ఏర్పాటు చేయకుండా విఒఎలను తొలగించడం దుర్మార్గమన్నారు. విఒఎలు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి గ్రామాల్లో అనేక సేవలందిస్తున్నారని, అయినా వారిపై కక్షగట్టి అన్యాయంగా తొలగించడం మానుకోవాలని తెలిపారు. 8 నెలలుగా వేతనాల్లేక విఒఎలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణం వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విఒఎలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు మరియమ్మ, యేసురత్నం, గ్రేసి, రమాదేవి, వరలక్ష్మి, సంధ్య, మార్త, మేరీ, రామలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఏలూరు నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ విజయవాడలో వరద సహాయక పనులు చేసిన మున్సిపల్ కార్మికులకు ఇవ్వాల్సిన రెండు జతల దుస్తులు, కుట్టుకూళ్లు వెంటనే ఇవ్వాలన్నారు. కార్మికులు పనిచేయడానికి కావాల్సిన పనిముట్లు, డబ్బాలు, తోపుడు బండ్లు, మాస్కులు, గ్లౌజులు ఏర్పాటు చేయాలని, బ్యాంకు లోన్లు ఇవ్వాలని, ఇఎస్ఐ కార్డులు ఇవ్వాలని, చనిపోయిన వారి వారసులకు రెండు లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు బకాయి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అన్నప్రగడ భాను ప్రతాప్ మాట్లాడుతూ విజయవాడ వరద సహాయక పనులు చేసిన కార్మికులకు రెండు రోజుల్లో దుస్తులు ఇస్తామని, బ్యాంకు అధికారులతో మాట్లాడి బాపట్లలో ఇప్పించిన మాదిరిగా లోన్లు ఇప్పించే ఏర్పాటు చేస్తామని, పనిముట్లు, తోపుడుబండ్లు, డబ్బాలు త్వరలో ఏర్పాటు చేస్తామని, తదితర హామీలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎ.జానుబాబు, లావేటి కృష్ణారావు, బంగారు వెంకటేశ్వరరావు, నాగమణి, తిరుపతమ్మ, జార్జి తదితరులు నాయకత్వం వహించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలి

సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలని, విద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ప్రకటన విడుదల చేశారు. రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరిట ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని తెలిపారు. నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టేందుకే పంపు సెట్లకు మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై ఏ భారమూ ఉండదని పైకి చెబుతున్నా ప్రయివేటు విద్యుత్ ఉత్పత్తిదారులకు దోచిపెడుతూ, ప్రజలపై భారాలు వేసేందుకు, ఉచిత విద్యుత్‌ను దశలవారీగా తొలగించడానికి ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం పంపు సెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి, జనసేన తీవ్రంగా వ్యతిరేకించాయని, ఆ నేతలు మీటర్లు పగలుగొట్టాలని పిలుపు ఇచ్చారని, అదాని, షిర్డీసాయి సంస్థలతో కుమ్మక్కై, వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని, నాడు ఆరోపించి నేడు కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కూ స్మార్ట్ మీటర్ పెట్టడం నమ్మకద్రోహమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆనాడు చంద్రబాబు ప్రభుత్వాన్ని కూలదోసినా మరో విద్యుత్ పోరాటం నేడు చేయాల్సి వస్తోందని హెచ్చరించారు.

విద్యతోనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

బాల కార్మిక వ్యవస్థను, బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించేందుకు అన్ని శాఖల అధికారులూ కలిసికట్టుగా కషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి అన్నారు. జిల్లా కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయంలో బుధవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీతో కలిసి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరంతర పర్యవేక్షణతో ఏలూరు జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా నిలపాలని జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులకు సూచించారు. బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. ఆ దిశగా అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలన్నారు. బాల కార్మికులను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. బాలల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యతన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు స్వచ్ఛంద సేవా సంస్థలు, యువత తమ వంతు సహకారం అందించాలన్నారు. ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ బాల కౌమార కార్మికులను గుర్తించడం, పునరావాసం కల్పించేందుకు పాన్ ఇండియా ప్రచారోద్యమంలో భాగంగా కార్మిక శాఖ కమిషనర్, జిల్లా కలెక్టరు, జిల్లా టాస్క్ ఫోర్సు కమిటీ ఛైర్మన్ ఆదేశాల మేరకు గత నెల 21వ తేదీ నుంచి ఈనెల 20వ తేదీ వరకూ బాల, కౌమార కార్మికులను గుర్తించుట, పునరావాసం కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 3 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, కర్మాగారాల శాఖ ఇనస్పెక్టర్ శ్రీనివాస్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ క్రాంతిప్రియ, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ప్రతినిధి రవికుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

ఎపిఎస్‌ఆర్‌టిసి రీజనల్ బోర్డు విజయవాడ జోన్ ఛైర్మన్‌గా రెడ్డి అప్పలనాయుడు బాధ్యతలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



బాధ్యతలు స్వీకరిస్తున్న రెడ్డి అప్పలనాయుడు

ఆర్‌టిసి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఎపిఎస్‌ఆర్‌టిసి రీజనల్ బోర్డు విజయవాడ జోన్ ఛైర్మన్‌గా విజయవాడ ఆర్‌టిసి భవనంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. జనసైనికులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ర్యాలీగా ఏలూరు పార్టీ కార్యాలయం నుంచి విజయవాడ కార్యాలయానికి చేరుకున్నారు. విజయవాడ జోన్ కార్యాలయం వద్ద భారీ గజమాలలతో ఘన స్వాగతం పలుకుతూ, వేద పండితులు, ఆశీర్వాదాల నడుమ ఛైర్మన్‌గా రెడ్డి అప్పలనాయుడు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సిఎం చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఎపిఎస్‌ఆర్‌టిసిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు, ఆర్‌టిసి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతలను సక్రమంగా తూచ తప్పకుండా నిర్వహిస్తానని తెలిపారు. ఆర్‌టిసి ప్రయాణికులకు మెరుగైన సేవలందించడానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ఎపిజెఎసి ఉద్యోగ సంఘాల నాయకులు, ఎపిపిఎఒ ఉద్యోగ సంఘాల నాయకులు, ఎపిఎస్‌ఆర్‌టిసి నాయకులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలను వ్యతిరేకించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాద్

జమిలి ఎన్నికలను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డివిఎస్‌విడి.ప్రసాద్ అన్నారు. ఆగిరిపల్లి సుందరయ్య నిలయంలో నిర్వహించిన సిపిఎం ఆగిరిపల్లి మండల ఆరో మహాసభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తిరస్కరించాలని, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్ల అమర్చటాన్ని వ్యతిరేకించాలని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఉపాధి హామీ చట్టం పని దినాలు పెంచాలని, మహాసభలో తీర్మానించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆగిరి పల్లి మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు, నాయకులు ఎఆర్.హనుమాన్లు, జి.పాపారావు, జె.గోపాలరావు, ఎం.నరేష్, ఇ.రవీంద్ర, ఎస్.కోటేశ్వరరావు, ఎన్.ఊళక్కయ్య, జె.శౌరి, స్టాలిన్, సుభాకర్, జహంగీర్ బాషా, పి.తాతారావు పాల్గొన్నారు.

9 మంది విద్యార్థులకు అస్వస్థత

మధ్యాహ్న భోజనంలో ఉడకని బంగాళదుంప కూర కారణమని అనుమానం

జోగన్నపాలెం ఎంపిపి పాఠశాలలో ఘటన

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని జోగన్నపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న తొమ్మిది మంది చిన్నారులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని హుటాహుటిన గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. అస్వస్థతకు గురైన చిన్నారులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ణ పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాంతులు, కడుపులో నొప్పితో బాధపడుతున్నట్లు గుర్తించారు. చిన్నారులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. తక్షణం అత్యవసర వైద్య సేవలందించాలని ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 24 మందిని పరీక్షించారు. అస్వస్థకు గురైన తొమ్మిది మంది మినహా మిగిలిన వారు ఆరోగ్యంగానే ఉన్నట్లు గుర్తించారు. అయినప్పటికీ వారికి ప్రాథమిక వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. దెందులూరు తహశీల్దార్ బి.సుమతి, దెందులూరు ఎంఇఒ అన్నమ్మలు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. సిబ్బంది మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలలో వండకుండా ఇంటి వద్ద వండుకుని తెచ్చినట్లు గుర్తించారు. గ్యాస్ బండ, ఇతర సామగ్రి పాఠశాలలో లేకపోవడంతోనే ఇంటి వద్ద వండుకుని వచ్చినట్లు సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఉడకని బంగాళాదుంప కూర తినడమే కారణంగా అధికారులు భావిస్తున్నారు.

అస్వస్థతకు గురైన చిన్నారులను 24 గంటలు ఆరోగ్య కేంద్రంలో పరిశీలనలో ఉంచారు. ప్రస్తుతానికి వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఏమైనా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలిస్తామని డిఎంహెచ్ఒ శర్మిష్ఠ తెలిపారు. విద్యార్థినులు అనారోగ్యానికి గురి కావడంతో వారి తల్లోదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

చిన్నారులను పరామర్శించిన ఎంఎల్ఎ ప్రభాకర్

గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న 9 మంది చిన్నారులను దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పరామర్శించారు. ప్రస్తుతం అందరి పరిస్థితి నిలకడగా ఉందని, మెరుగైన పర్యవేక్షణకు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలిస్తున్నామని తెలిపారు. ఘటనపై తక్షణమే విచారణకు ఆదేశిస్తామన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

ఆర్‌డిఒ పరామర్శ

ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలను ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ బుధవారం రాత్రి పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆదేశించారు.

పోలవరం నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - పోలవరం



పతాకావిష్కరణలో పాల్గొన్న నేతలు, ప్రతినిధులు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన పరిహారం, పునరావాసం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోడ్లు వేయాల్సిన ప్రభుత్వం ఆ పనులు పూర్తి చేయకుండా అన్ని రోడ్లకు టోల్ వసూలు చేస్తామని ప్రకటించడం దుర్మార్గమని, తక్షణమే రోడ్లకు టోల్ విధించే ప్రకటనను వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని ఇటుకలకోటలో అమరజీవి రుద్రరాజు సత్యనారాయణ (ఆర్ఎస్) నగర్‌లో సిపిఎం ఐదో మండల మహాసభ నిర్వహించారు. ఈ మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు గోకూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం మండల మహాసభకు బొరగం భూచంద్రరావు, పి.లక్ష్మీకుమారి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ మహాసభలను ఉద్దేశించి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్, భవిష్యత్తుకు గ్యారంటీ పథకాల అమలు చేయాలన్నారు. భూ పంపిణీ చేయకుండా అసెంబ్లీలో భూ ఆక్రమణదారులను నిలువరించేందుకు చట్టం చేయడం దుర్మార్గమని విమర్శించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో నాయకులు తామ బాలరాజు, పి.ప్రగతి, ఎస్.సాయికృష్ణ, కారం భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్‌టిసి ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ధర్నా చేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆర్‌టిసి స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం ఏలూరు డిపో వద్ద ఆర్‌టిసి ఉద్యోగులు గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌బి.అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులు విధి నిర్వహణలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, 1/2019 సర్క్యులర్ అమలు చేయకపోవడం వల్ల ఉద్యోగులపై వేధింపులు, పనిష్మెంట్లు, డ్యామేజీ రికవరీలు, పనిభారాలు పెరిగాయన్నారు. ఆత్మగౌరవంతో తమ విధులు నిర్వహించలేక అనేకమంది పని ఒత్తిడికి లోనై అనారోగ్యం పాలై అకాలంగా మరణిస్తున్నారన్నారు. మరో వైపు నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నా ఆర్‌టిసి ఉద్యోగులకు రావాల్సిన జీతభత్యాల పెంపు, అలవెన్సులు వంటి ఆర్థిక సమస్యలు పరిష్కారం కావడం లేదని, రిటైర్డ్ అవుతున్న, రిటైర్డ్ అయిన కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఆర్‌టి డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి గోపీ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర, జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్‌ఆర్‌కెవి.ప్రసాద్, టికె.రావు, పి.పరమయ్య, కెవివివిజెవి.చారి, జివి.రావు, బి.సూర్యకళ పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా దుర్గారావు



ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సిపిఎం మండల కార్యదర్శిగా తెల్లం దుర్గారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగన్నాధపురంలో నిర్వహించిన సిపిఎం మండల ఎనిమిదో మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. అనంతరం మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి దుర్గారావు మాట్లాడుతూ రానున్న మూడు సంవత్సరాల్లో భూ పోరాటాలను పెద్దఎత్తున నిర్వహిస్తానని తెలిపారు. పునరావాస కాలనీల్లో నిర్వాసితుల సమస్యలపై పోరాడతానన్నారు. వంకవారిగూడెంలో నిర్మించ తలపెట్టనున్న నేవీ ఆయుధ డిపోను ఏజెన్సీ ప్రాంతం నుంచి తరిమెందుకు అందరం కలిసి ఉద్యమిద్దామని కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. నూతన మండల కమిటీ సభ్యులుగా ఎస్.సీతారామయ్య, సిహెచ్.కొండలరావు, కారం నాగదుర్గ, కల్లూరి దావీదు, తోడం గంగులు, గుండె గంగరాజు, కారం బోడెమ్మ, తెల్లం శంకరుడు, గుజ్జు నాగేంద్ర, సోయం కన్నమ్మ, రాజమండ్రి దానియేలు ఎన్నికయ్యారు.



ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

హమాలీల జీతాలు పెంచాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - కుక్కునూరు

పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీలకు ప్రతి రెండేళ్లకోసారి జీతాలు పెంచుతూ ఒప్పందం చేసుకున్నారని, 2024 జనవరి కల్లా ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటివరకు నిరసిస్తూ అల్లూరి సీతారామరాజు హమాలీ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కుక్కునూరు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, యూనియన్ మేస్త్రి తిరోజుల సురేష్ మాట్లాడుతూ యూనియన్‌తో చర్చలు జరిపి తక్షణమే హమాలీల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఒప్పంద కాలం పూర్తయి 11 నెలలైనా ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. పౌర సరఫరాల శాఖలో మండల, గ్రామ స్థాయిలో నిత్యావసరాలను రేషన్ షాపులకు చేరవేసే కార్మికుల కష్టాలు వెలకట్టలేమన్నారు. కార్మికులు ఎంతో కష్టపడి సరుకులను మండల స్టాక్ పాయింట్ల నుంచి గ్రామాల్లో ఉన్న రేషన్ షాపులకు చేరవేస్తున్నారని తెలిపారు. ఒక్కరోజు కూడా లేట్ కాకుండా పని చేస్తున్నారని, కూలిరేట్లు పెంపుదల, ఏరియర్స్, బోనస్, ఇఎస్ఐ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీల కష్టాన్ని ఈ ప్రభుత్వం గుర్తించాలని, తక్షణమే ప్రభుత్వం స్పందించాలని అన్నారు. ఈ ధర్నాలో కడారి తిరపతయ్య, గరటం శ్రీను, లాడే వెంకట్రావు, ముత్తేష్, నాగరాజు, లక్ష్మణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలో జనవాసాల మధ్య ఉన్న వైన్ షాపులు దూరంగా ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒకు అందించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ ముంపు పేరుతో మండల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి అభివృద్ధి పనులు చేయడం లేదన్నారు. కుక్కునూరు మండల కేంద్రంలో పశువైద్యశాలలో వెటర్నరీ డాక్టరును నియమించాలన్నారు. మండల కేంద్రంలో మహిళల కోసం సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. మండలంలో ఊర కుక్కల బెడదను నివారించాలన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద రింగ్ రోడ్డును నిర్మించాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇంటి స్ట్రక్చర్ వాల్యులు వెంటనే ఇచ్చి, పునరావాస కేంద్రాలకు తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భయ్యాన శ్రీను, పులదాసు రమేష్, ఎస్‌కె.మహబూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక సర్ సిఆర్.రెడ్డి కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1,2, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అటానమస్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు 50 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎండిఎం బాషా, బి.శంకర్, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా విభాగం డాక్టర్ వరప్రసాదరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది కొల్లి రమణ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూటాల గ్రామపంచాయతీ వైస్ ప్రెసిడెంట్ కరిబండి శ్రీనివాస్ పాల్గొని అర్హులైన 37 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందిచారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ పూనెం పోసిబాబు మాట్లాడుతూ డిసెంబర్‌లో పోలవరంలో కూడా ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ పూనెం పోసిబాబు, సెక్రటరీ తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, కన్వీనర్ అకుల నర్సింహామూర్తి, మడకం స్వామి అయ్యప్ప, జిల్లా కన్వీనర్ వి.చంద్రయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 23వ తేదీన జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్వహించనున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్‌మెంట్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, జనాభాకు అనుగుణంగా మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ చింతలపూడి యూనియన్ అధ్యక్షురాలు వెలగాడ అనురాధ, యూనియన్ నాయకులు ఒడిత్య బాలు, దాసరి శ్యాయమ్మ, దాసరి రమాదేవి, పొదిలి పుల్లయ్య, దాసరి నాగయ్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని సింగన్నగూడెం గ్రామంలో బుధవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు నూజివీడు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు.

5 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో స్థానిక వైఎస్ఆర్ కాలనీ వద్ద సిబ్బంది బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జిఎస్.కృష్ణధనరాజు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ పి.సుధీర్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

నల్ల రిబ్బన్లతో 108 సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

108 సిబ్బందిని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, పని గంటలను 12 గంటల నుంచి ఎనిమిది గంటలకు తగ్గించాలని కోరుతూ 108 సిబ్బంది బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నల్ల రిబ్బన్‌లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 సిబ్బందిని ప్రభుత్వ రంగంలో కలపాలని, గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని, ప్రభుత్వాలు మారినప్పుడల్లా సర్వీస్ ప్రొవైడర్లు మార్చడం తగదని ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పైలట్లు పుల్లారావు, శ్యామలరావు, ఇఎంటిలు ఆనందరావు, వీర పుల్లారావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సునీలారెడ్డి

ప్రజాశక్తి - ముసునూరు

జిల్లాస్థాయి త్రో బాల్ ఆటల పోటీలో తమ పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ముసునూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.సునీలారెడ్డి తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా గూడూరు ఉన్నత పాఠశాలలో ఈ నెల 13వ తేదీన జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ ఎంపికలో అండర్ -17 విభాగంలో బాలికల జట్టు నుంచి పి.ఐశ్వర్య ఎంపికైందన్నారు. వచ్చే నెల12, 13 గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆ విద్యార్థినిని, ఆమెకు తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు అలీఖాన్, హేమలను స్టాఫ్ సెక్రటరీ గంగుల నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యార్థులు చదువుతో పాటు, ఆట పాటల్లో కూడా తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో ఉన్న హీల్ పాఠశాలలో విద్యార్థులకు పాటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా విద్యార్థులను పరిచయం చేసుకొని, పోలీస్ శాఖ ద్వారా మహిళలకు, విద్యార్థినులకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్, హీల్ పాఠశాల సిఇఒ కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధిగ్రస్తులకు ఎంఎం కిట్లు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కుష్టు వ్యాధిని సకాలంలో గుర్తించినట్లయితే అంగవైకల్యాన్ని నివారించుకోవచ్చని లంబాడిపేట పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ట్వింకిల్ సూచించారు. ట్వింకిల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో లంబాడిపేటలోని ఆరోగ్య కేంద్రంలో బుధవారం లెప్రసీ వ్యాధిగ్రస్తులకు ఎంఎం కిట్లను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ట్వింకిల్ మాట్లాడుతూ నొప్పిలేని, స్పర్శ లేని, రాగి రంగు గల మచ్చలుంటే కుష్టు వ్యాధి కావడానికి అవకాశం ఉందని వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య కార్యకర్తలకు తెలిపారు. ముందుగా ఆ సూచనలు గుర్తించినట్లయితే వ్యాధి నిర్ధారణ జరిగి తొందరగా నయం చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అసిస్టెంట్ అధికారి జె.గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ హైమావతి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, లెప్రసి సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'అందరికీ అండగా టిడిపి'

ప్రజాశక్తి - దెందులూరు

పార్టీ కోసం సేవలందించిన ప్రతి ఒక్కరికీ తెలుగు దేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పెనుబోయిన మహేష్ యాదవ్ దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ పార్టీకోసం కృషి చేసిన దెందులూరు నియోజకవర్గంలోని నాయకులకు నామినేటెడ్ పదవులు లభించటం అభినందనీయమన్నారు. టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు పెనుబోయిన మహేష్ యాదవ్ మాట్లాడుతూ తన సేవలను పార్టీ గుర్తించి యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పలువురు కూటమి నాయకులు మహేష్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారిణి ఎంవి.రమణ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయన్ని ఆయన బుధవారం సందర్శించి పలు దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం లాగిన్‌లో వచ్చిన భూ వివాదంపై క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. భూమికి సంబంధించిన వివాదాన్ని పరిష్కరించాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా పలు రకాల ఫిర్యాదులు 30 వరకు వచ్చినట్లు తహశీల్దార్ స్లీవజోజి తెలపగా అట్టి అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆమె తెలిపారు.


వివాదస్పద భూమిని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

తగరం కళ్యాణ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తగరం కళ్యాణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. తగరం కళ్యాణ్ కుటుంబ సభ్యులను సంఘం జిల్లా కమిటీ బృందం పరామర్శించి మనోధైర్యం చెప్పి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సహాయం రప్పించటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సంఘం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో పామాయిల్ గెలలు కోస్తూ విద్యుదాఘాతంతో తగరం కళ్యాణ్(28) మృతి చెందాడు. కళ్యాణ్ మృతికి సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పామాయిల్ కార్మికులు విద్యుదాఘాతంతో చనిపోతున్నారన్నారు. దీనిపై విద్యుత్ శాఖాధికారులు, ఉద్యానవన శాఖాధికారులు ఏమాత్రం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రాణాలు తెగించి పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కనీసం సంక్షేమ బోర్డు కూడా ఏర్పాటు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, తడికలపూడి వంటి ప్రాంతాల్లో రోజుకొకరు విద్యుత్ షాక్‌తో చనిపోతున్నారన్నారు. వారికి వారి కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే పామాయిల్ కార్మికులందరినీ ఐక్యం చేసి చనిపోయిన కుటుంబాలకు న్యాయం జరిగేంతవరకూ ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్ష, కార్యదర్శులు యాగంటి సీత, అందుగుల ప్రభాకరరావు, పిల్లి చంటి, జోడే సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జెకెసి, ఏలూరు జిల్లా సెట్వెల్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సమాజంతో సామరస్యంగా వ్యవహరించడానికి కావల్సిన వ్యక్తిత్వ నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. సెట్‌వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాకారం చేసుకోవడానికి నిరంతరం శ్రమించాలన్నారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సి.మధుసూదన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. అనంతరం సెట్‌వెల్ సూపరింటెండెంట్ జాన్ కెన్నెడీ, జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ ఆర్.పట్టాభి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు, జెకెసి కో-ఆర్డినేటర్ టివిఎస్.పద్మావతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, ఎస్.పరమేశ, ఎం.కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా హుస్సేన్

ఏలూరు అర్బన్ : రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు షేక్ హుస్సేన్ అధ్యక్షతన సర్ సిఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఆడియో విజువల్ హాలులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు మాట్లాడుతూ అసోసియేషన్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు కార్యక్రమాల నివేదికను సమర్పించారు. ట్రెజరర్ పి.ఆంజనేయులు ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ అకౌంట్స్‌ను సమర్పించారు. ఎన్నికల అధికారి ఎన్‌సి డేనియల్ పర్యవేక్షణలో కొత్త కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా షేక్ హుస్సేన్, ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ పి.సుబ్బలక్ష్మి, కార్యదర్శిగా ఎల్.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా పి.ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా మరో పది మంది ఎన్నికయ్యారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కూటమి ప్రభుత్వం రైతాంగ సమస్యలు తక్షణం పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ రబి సీజన్ ముగిసి ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ నడుస్తుందని, రైతాంగ సమస్యలు పరిష్కరిస్తానని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎన్నికల వాగ్దానాన్ని నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం రైతులకు తక్షణం సాగు సాయం కింద రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మాణం చేపట్టాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని కోరారు. ఈ ధర్నాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, సిపిఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, ఏలూరు ఏరియా కౌన్సిల్ సభ్యులు నాగం అచ్యుత్, తెర్లాపు శ్రీను, ఎంఎ.హకీమ్, మహిళా సంఘం నాయకులు ఉప్పులూరి లక్ష్మి, భవాని, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

బాలల హక్కుల పరిరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ డి.వెంకటేశ్వరరావు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని ఈదులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలు-ఆరోగ్యంపై ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వట్టిగుడిపాడు, పొలసానిపల్లిలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాలు - ఆరోగ్యంపై ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొలసానిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రిబ్కా మాట్లాడుతూ క్షణ కాలం సంతోషం కోసం విద్యార్థులు నూరేళ్ల జీవితంలోని వెలుగును దూరం చేసుకుంటున్నారన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ డి.వెంకటేశ్వరావు, మండల పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నాగమణి, శేఖర్ బాబు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల :మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఏలూరు జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు, దత్తత మహోత్సవాలు పురస్కరించుకుని మండలంలోని రామన్నగూడెం పంచాయతీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.భార్గవి మాట్లాడుతూ పిల్లలు లేని తల్లిదండ్రులు చట్టరీత్యా దత్తత తీసుకోవాలన్నారు. ఎవరైతే పిల్లలు వద్దనుకున్నారు బాలల హెల్ప్‌లైన్ 1098కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ యూనిట్ సిబ్బంది రాజేష్, ఐసిడిఎస్ సెక్టర్ సూపర్‌వైజర్ మేరీ, డిసిపియు సిబ్బంది రాజ్‌కుమార్, అంగన్వాడీ వర్కర్స్, సచివాలయ మహిళా కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు, బాలలు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు బాలల గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు, బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఇఒ ఆర్.రంగయ్య హాజరయ్యారు. ప్రముఖ నాట్య కళాకారులు డి.హేమసుందర్ మాట్లాడారు. సాంస్కృతిక కళలు దేశానికి పట్టు కొమ్మలని తెలిపారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అనేక పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెడల్, బహుమతి అందించారు. ఈ కార్యక్రమానికి అభివృద్ధి కమిటీ సభ్యులు, వివిధ పాఠశాలల టీచర్స్, విద్యార్థులు, పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు సభకు సమాధ్యక్షులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ వారోత్సవాల్లో వివిధ రకాల పోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. అనేక సాంస్కృతిక సంస్థలు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో బహుమతులు అందించారు. ఏలూరు నుంచి గెలుపొందిన వారికి సర్టిఫికెట్లను బహుకరించారు.

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు గ్రంథాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.సునిలారెడ్డి, సిల్క్ నగర్ ప్రధానోపాధ్యాయులు కొప్పుల బాబూరావు, భారతీయ విద్యా నికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండేటి శౌరి మాస్టర్, శాంతినికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేల్పుల శివకోటి యాదవ్ పాల్గొన్నారు.

టి.నరసాపురం :గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని ఎస్ఐ ఎం.జయబాబు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల మగింపు వేడుకలు గ్రంథాలయాల పాలకులు ఆర్.కిషోర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

చాట్రాయి : మండలంలోని చనుబండ శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కృష్ణారావుపాలెం ఎంపిటిసి సభ్యులు చింత గుంట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి చదువుకుని మంచి జ్ఞానం పొందాలన్నారు. వారం రోజులుగా వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందించారు.

ద్వారకాతిరుమల : పంగిడిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు పి.సురేష్ అధ్యక్షత వహించి విద్యార్థులంతా గ్రంథాలయం అలవాటు చేసుకుని పుస్తకాలు చదివి విజ్ఞానం పొందాలన్నారు. తెలుగు పండిట్ డాక్టర్ మద్దాల పెద్దిరాజు మాట్లాడుతూ గ్రంథాలయం-ఆధునిక దేవాలయమన్నారు. అనంతరం సెల్ ఫోన్ వద్దు-పుస్తకాలే ముద్దు అంశంపై వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా తెలుగు పండిట్ కె.రమేష్ వ్యవహరించగా ఉపాధ్యాయులు మల్లయ్య, కుమారస్వామి, రాంబాబు, సుబ్బారావు, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణ, వైద్యాధికారులు కె.త్రివేణి, షేక్ అమీర్ సుల్తానా, నీలపాల దీప్తి, నీలి మాధవి చేతుల మీదుగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు తెలిపారు. మండలంలోని కోరుకొల్లు శాఖా గ్రంథాలయంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సర్పంచి బట్టు లీలా కనక దుర్గా మహేష్, ప్రధానోపాధ్యాయులు ఏసురాజు చేతులమీదుగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించినట్లు శాఖా గ్రంథాలయాధికారి రాచాకుల రాఘవులు తెలిపారు.

ముదినేపల్లి :వారం రోజులుగా ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ముదినేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎపి టూరిజం డెవలప్‌మెంట్ డైరెక్టర్ కొడాలి వినోద్ సహకారంతో వారం రోజులుగా జరిగిన వివిధ రకాలైన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వినోద్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యద్దనపూడి రామకృష్ణ మాట్లాడారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు పి.రవీంద్ర గ్రంథాలయ వారోత్సవాల గురించి విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఆధార్ క్యాంపు పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్డేషన్ కరక్షన్ క్యాంపును పోలవరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధార్ కరక్షన్ అప్డేషన్ చేయించుకోవాల్సినవారు త్వరితగతిని చేసుకోవాలని సూచించారు. జిల్లాల విభజన నేపథ్యంలో ఆధార్ అప్డేషన్ కరక్షన్ ప్రతిఒక్కరూ విధిగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సజిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు మినుము విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - కలిదిండి

రబీ సీజన్‌లో ప్రభుత్వం ద్వారా అందే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి బట్టు లీలా కనక దుర్గా మహేష్ అన్నారు. మండలంలోని కోరుకొల్లు రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మినుము విత్తనాల ప్యాకెట్లను సర్పంచి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. విత్తనాలు చల్లే ముందు వాటిని శుద్ధి చేయడం వల్ల తెగుళ్ళ, క్రిమి సంహారకాలను నివారించుకోవచ్చని కైకలూరు ఎడి గంగాధరరావు అన్నారు. మాజీ ఎంపిపి వలవల రామారావు, కేశిరెడ్డి బలరాం, రాజా రమేష్, ఆంజనేయులు, ఎఒ విద్యాసాగర్, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం ద్వారా ఎంపికైన సీసీ రోడ్లను పరిశీలిస్తున్నట్లు ఎంపిడిఒ జి.రాణి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని ఎస్‌సి, బిసి, ఒసి ఏరియాలో పలు రోడ్లు ఎంపికై వాటిని ప్రథమ దశలో కంకర పోశారు. ఆ రోడ్లను పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామ సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి, ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు, వార్డు సభ్యులు నల్లిబోయిన రాంబాబు, గార్లపాటి నరసింహరావు, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు.

రైతులందరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రానున్న రబీ పైరుకు రైతులందరూ ఇన్సూరెన్స్ విధిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి.వేణుమాధవ్ కోరారు. మండలంలోని వణుదుర్రు, వాడవల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ రైతులు ప్రీమియం కింద మినుముకు ఎకరానికి రూ.60 కట్టాల్సి ఉంటుందని తెలిపారు. మండల పశువైద్యాధికారి రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో పశువుల గణన జరుగుతుందని, రైతులందరూ తమకు సంబంధించిన మేకలు గొర్రెలు, కోళ్ళ, పశువులకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పేదల క్షేమమే ధ్యేయం : సిపిఐ

ప్రజాశక్తి - కుక్కునూరు

పేదల క్షేమమే ఎర్రజెండా ధ్యేయమని, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాడేది సిపిఐ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. కుక్కునూరు మండల కేంద్రంలో చర్చి హాస్టల్ ఆవరణలో బుధవారం మండల కార్యవర్గ సభ్యులు మడిపల్లి రమణయ్య అధ్యక్షతన విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మన్నవ కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. 45 కాంటూరులో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి, నిర్వాసితులకు పరిహారం ఇచ్చి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 26న జరిగే వందేళ్ల సంబరాలను మండలంలో ఘనంగా జరుపుకోవాలన్నారు.

బేటి బచావో - బేటి పడావో

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బేటి బచావో - బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కరుణకుమారి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. మిషన్ శక్తిపై విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు. ప్రదానోపాధ్యాయులు స్వర్ణకుమారి, ఎంఎస్‌కెజి లీలా కుమారి, ఆర్.శ్రీలత, అంగన్వాడీలు పాల్గొన్నారు.

దావా సమన్లు

IN THE COURT OF THE HON'BLE PRL.CIVIL JUDGE(JUNIOR DIVISION):: GUNTUR

OS No:1092/ 2019

Between:
State Bank Of India,SMEC, Krishna Nagar,Guntur,Rep.by it's Chief Manager ....Plaintiff

And

Akhila Elegance. Guntur, rep. by its Prop. Kodati Rama Mohana Rao & Another ..... Defendants

To.
D-2: Sri Kodati Rama Mohana Rao, R/o.C/o.P.Mohan, Gopalunivari Street, Rail way Track Lane, C.P.J. Office Road, R.R. Pet, Eluru-34007, West Godavari Dist.

పై నెంబరు దావాలో 2వప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:03-12-2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:03-12-2024

లంకా విజయకుమార్,
లంకా వంశీకృష్ణ,
వాది తరపు అడ్వకేట్స్,
రవీంద్ర నగర్, గుంటూరు.